# అసమర్థుని ఆదర్శం

వారణాసి శ్రీరామమూర్తి

"ఏరా రామం! తయారయ్యావా? అప్పుడే ఆరయింది," అంటూ ప్రకాశరావు హుషారుగా గదిలోకి వచ్చిన వాడల్లా రామాన్ని చూడగానే నీళ్ళు కారాడు. ఆనాడు మొదటి ఆట "హెలెన్ ఆఫ్ ట్రాయ్" చూద్దామని కాలేజినుంచి వచ్చేటప్పుడే ఇద్దరూ ప్రోగ్రాం వేసుకున్నారు. ప్రకాశరావు త్వరగానే కార్యక్రమం ముగించుకొని వచ్చాడు. కాని రామం ఇంకా కాలేజి బట్టలైనా మార్చుకుండా కిటికీలోంచి తోటలోకి తదేక దృష్టితో చూస్తూ కూర్చున్నాడు. రామాన్ని చూడగానే ప్రకాశరావుకి ఒకవిధమైన విసుగు, కోపంకూడా కలిగాయి.

రామం ఉలిక్కిపడి "ఆఁ! మార్చుకుంటాను. అయినా ఈవేళ సినిమాకు వెళ్ళకపోతే నేమిరా? నా మనస్సు బాగోలేదు."

ఈదెబ్బతో ప్రకాశరావు మరి ఉండబట్టలేకపోయాడు. తన ఆనందమంతా ఖూనీ అయినట్లు ఫీలయ్యాడు.

"నవ్వీమధ్య మరీ వింతమనిషివయి పోతున్నావేమిరా? మునుపటి చురుకు రవ్వంతైనా కన్పించటంలేదు ప్రేమలో పడ్డావేమిటి కొంపతీసి. ఎప్పుడు చూసినా ఒకటే ఆలోచన."

"అవును. ఒకవిషయం గురించే ఆలోచిస్తున్నాను. నామనస్సు చాలా గాయపడింది. దాన్ని ఎలా తేల్చాలో అర్థంకాకుండా ఉంది. కాని ఆ విషయం ప్రేమమాత్రం కాదు." అంత విషాదంగా ఉన్నవాడు కూడా కొద్ది చిరునవ్వుతో అన్నాడు.

రామంధోరణి చాలా క్రొత్తగా ధ్వనించింది ప్రకాశరావుకి. సెలవలకి ఇంటికివెళ్లి తిరిగి వచ్చినప్పటినుంచి ఇలాగ మారిపోయాడు. ఎప్పుడూ ఏవిషయాన్ని సీరియస్‌గా తీసుకోని రామం ఏ సమస్యతో ఇలా క్రుంగిపోయాడో అర్థంకాలేదు ప్రకాశరావుకి. వాడికి ఎటువంటి బాదరబందీలు లేవు. వాడిచదు వేమిటో, వాడేమిటో. కాని ఇలా ఎప్పుడూ బాధపడి ఎరుగడు డిబేటులో సాంఘిక సమస్యలను తీసుకొని చర్చించి అందర్నీ ఆశ్చర్యపరచేవాడు. ఆరోజున డిబేట్‌నుంచి తిరిగివస్తున్నప్పుడు, ఎప్పుడూ ఎవరినీ పలుకరించి ఎరుగని లలిత "వరకట్నాలమీద మీకున్న అభిప్రాయానికి నాకు చాలా సంతోషం. అవినీతి, అన్యాయం పెరిగిపోతున్న నేటిసమాజంలో మీలాంటి యువకులు బయలుదేరడం మా మహిళల అదృష్టం మా అందరితరఫునా నా కృతజ్ఞతా వందనాలు" అంది. వాడు తనవ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొంటానంటాడు. తన ఆత్మాభిమానానికి దెబ్బతగిలే ఏపని చేయనంటాడు. తనకు తన స్వంత ఆలోచనల మీదే విశ్వాసమంటాడు. లెక్చరర్లుకూడా వాడి నిశితబుద్ధిని చాలా శ్లాఘించారు. కాని ఇతడు అప్పటి రామంకాదు. ఏమాత్రం చురుకులేదు. ఎప్పుడూ మందంగా ఆలోచిస్తూ కూర్చుంటున్నాడు. ప్రతిదీ అయిష్టంగానే చూస్తున్నాడు. ఎప్పుడూ ఏదో ఆలోచనే.

దీనికి ప్రబలమైన కారణం ఏదో ఉండాలనుకొన్నాడు ప్రకాశరావు. రామం, ప్రకాశరావు, బి. ఎ సీనియర్ క్లాసు చదువుతున్నారు వాళ్ళిద్దరిమధ్య ఎడతెగని స్నేహం. ఎలాగైనా ఈనాటితో సమస్యేమిటో తేల్చవలసిందే ననుకొన్నాడు ప్రకాశరావు. తిరిగి రామం, "మునుపటి రామం"గా మారాలనుకొన్నాడు.

"నిన్నంతగా గాయపరచిన విషయమేమిటిరా" మాటవరస కన్నట్లుగా అన్నాడు ప్రకాశరావు.

"ఇప్పుడు కాదులే! తర్వాత చెప్తాను."

"కాదిప్పుడే చెప్పాలి. చెప్పకపోతే నన్ను చంపుకుతిన్నట్టే."

ఈ మాటతో రామం కొంచెం చలించేడు.

."నీకు చెప్పకూడనిది ఏంలేదు. నీకంటె నాకు ఆప్తులెవరూ లేరు. ఆ విషయం నాకు తెలుసు"

"అయితే నీకొచ్చిన సమస్యేమిటో త్వరగా చెప్పు."

ప్రకాశరావు మరీ బలవంతం చేయటంచేత రామం చెప్ప నారంభించేడు.

"నేను సంక్రాంతి సెలవులకి ఇంటికి వెళ్లేటప్పుడు సాధారణంగా ప్రతివాడు ఎంత ఆనందంగా ఉంటాడో నేనూ అలాగే ఉన్నాను. వెళ్లగానే అమ్మ, చెల్లాయి చాలా ఆప్యాయంగా పలకరించేరు. నాన్న "జాగ్రత్తగా చదువుతున్నావా?" అని అడిగేరు. "ఊఁ" అన్నాను

ప్రతి తలీ 'అనేటట్లుగానే అమ్మకూడ "చిక్కిపోయేవురా! నాయనా!" అంది. నేను చిరునవ్వుతో ఊరుకున్నాను.

"చదివేవాడు కాస్త చిక్కకుండా ఎలా ఉంటాడు?" నాన్న సమాధాన పరిచేడు.

"కాదే అమ్మా! త్వరగా ఒక వదినను తీసుకు రావాల్సిందే!" అంది చెల్లాయి నవ్వుతూ. నేను గుడ్రెర్ర చేయడంతో పారిపోయింది. అందరం నవ్వుకొన్నాం. ఇలాగ రెండు రోజులు ఆనందంగా గడిచింది. అమ్మ నాకిష్టమైన పదార్థాలన్నీ చేసిపెట్టేది.

ఒకరోజున రాత్రి భోజనాలయ్యాక, నాన్న, నేను ఆరుబయట పడుకొన్నాం. అమ్మ, చెల్లాయి ఇంకా ఇంట్లో ఏదో పని చేసుకొంటున్నారు.

నాన్న ప్రారంభించేడు. "అయితే, జాగ్రత్తగా చదువుతున్నట్టేనా? ఈ ఏడాది ఎలాగో కష్టపడి ప్యాసు అయ్యావంటే మన కష్టాలన్నీ గట్టెక్కినట్టే. నేను ప్రతి నెలా ఆ ఏభైరూపాయీలు పంపడానికి ఎంత కష్టపడుతున్నానో నీకు తెలిసే ఉంటుంది."

ఔను నాకు తెలుసు. నాన్న చిన్నప్పట్నుంచి నాకోసం, చెల్లాయికోసం ఎంతో కష్టపడుతున్నాడు నా చదువుకోసమని ఉన్న ఒక ఎకరం కూడా అమ్మేశాడు నా చదువుకోసం అనేకమంది చుట్టాలనుకొన్నవాళ్ళు చాలా అడ్డులు చెప్పారు. కాని నాన్న వాటిని లెక్కచేయలేదు. ఇప్పుడు నాన్న ఉద్యోగం మీద వస్తున్న ఆ నాల్గురూకలే సంసారానికి ఆధారం. త్వరగా చదువు ముగించి అమ్మని నాన్ననిసుఖపెట్టా

# ★ అసమర్థుని ఆదర్శం ★

లని హృదయపూర్వకంగా అనుకొన్నాను.

మళ్ళీ నాన్న ఇలా గండుకొన్నాడు, "చూడు, చెల్లాయి పెళ్ళి తరవాయి ఉంది. కట్నాలు చూస్తే వేలకి వేలు ఇవ్వాలి. ఇంట్లో చూస్తే చిల్లిగవ్వ లేదు చూస్తూ చూస్తూ, పిల్లను ఏ రెండో పెళ్ళివానికో ముడిపెట్టడానికి ఏ తండ్రికీ మనస్కరించదు కదా? అందుకే నీకీ ఏడాది పెళ్ళి చేసెయ్యాలని నిశ్చయించుకొన్నాను సుబ్బయ్య శాస్త్రిగారు మొన్న వచ్చి వాళ్ళ పిల్లనిస్తామన్నారు."

మొట్టమొదట నాకిక్కడే అనుమానం వచ్చింది? నా పెళ్ళికి, చెల్లాయి పెళ్ళికి ఉన్న సంబంధమేమిటో అర్థం కాలేదు. నా పెళ్ళి అయితే, చెల్లాయి వివాహం ఎలా జరుగుతుంది నాన్న ఆడబోయే బ్రహ్మాండమైన నాటకానికి నాంది అనుకున్నాను

నాన్న తిరిగి అందుకున్నాడు "వాళ్ళు రెండు వేలిస్తామన్నారు అందులో కొంత డబ్బు చెల్లాయి పెళ్ళికి పనికి వస్తుంది"

వెంటనే నన్ను ఆందోళనలు ఆవరించుకున్నాయి కట్నం ఒక్క కానీ కూడా తీసుకోకూడదని నేను ఏనాడో నిశ్చయించుకొన్నాను. కాని నాన్న దానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు నా వ్యక్తిత్వం. ఆ దర్శంమీద ఇంకొకళ్ళకి అధికారం లేదు ఈమాటే చెప్పాలనుకొని "నేను ఆ సంబంధం చేసుకోలేను నాన్నా! ఇంతకీ కట్నం తీసుకొని పెళ్ళి చేసుకోవడం నీచంగా భావిస్తాను. ఈ విషయం నీక్కూడా తెల్సిందే. నా మనస్సుకి వ్యతిరేకంగా ఏ పనీ చెయ్యలేను." అన్నాను ఉద్వేగంగా.

దీనితో నాన్న ముఖం మలినమైంది. కోపంతో ముఖమంతా కందగడ్డయింది. "అయితే చెల్లాయి పెళ్ళెలా చేస్తావ్? రెండు వేలదాకా ఇస్తేగాని ఎవరు చేసుకుంటారు." అని గట్టిగా అరిచాడు

అయినా నేను చలించలేదు. "ఏమో! మీ యిష్టం" అని విసుగ్గా గుప్పటె తీసుకొని లోపలికి పోయేను

"బాధ్యతా విహీనుడు!" నాన్న గొణుగుడు వినిపించింది.

రాత్రంతా ఇదే ఆలోచన. నిద్ర పట్టలేదు. తెల్లవారుఝామున ఎప్పుడో పట్టింది. తెల్లారి ఏడింటిదాకా లేవలేదు ముఖమంతా వాడిపోయింది. కళ్ళు ఎఱ్ఱగా అయ్యాయి కాలకృత్యాలుముగించి కాఫీ త్రాగి కూర్చున్నాను.

ఇంతలో అమ్మవచ్చి "నాయనా! నీకు కొంత చెప్పాలనుకొంటున్నాను. సాంతం, నెమ్మదిగా వింటావా?" ప్రతిమాలుకొంటున్నట్లుగా అంది.

"తప్పకుండా చెప్పమ్మా! వింటాను" ఇక్కడొకమాట చెప్పాలి అమ్మ మామూలు స్త్రీలలాగ ప్రతీ చిన్న విషయానికి కన్నీరు కార్చదు. విషయాన్ని బాగా విమర్శి అర్థంచేస్తుంది. ఇంట్లో చిన్న చిన్న విషయాలను నాన్న హంగామా చేయడం, అమ్మ వాటిని సర్దడం పరిపాటి కొద్దిగా చదువుకుందికూడా నేమో బాగా మాట్లాడుతుంది.

"ప్రతిమనిషికి కొన్ని కోర్కెలూ, ఆదర్శాలు ఉండడం సహజం ఉండాలంటాను కూడా!" పెద్ద వేదాంతిలా మొదలెట్టింది. "కాని పరిస్థితులు మనకోరికలకు అడ్డుతగుల్తాయి అప్పుడు మానవుడు పరిస్థితులను అనుకూలంగా చేసుకోవడానికి చాలా ప్రయత్నిస్తాడు కాని అవి విషమంగా పరిణమిస్తాయి అప్పుడు మానవుడు వ్యర్థప్రయత్నాలుమాని తలఒగ్గడమే శ్రేయస్కరం."

"అయితే ఇప్పుడు నా వ్యక్తిత్వాన్ని గులుకొని మీరు నిశ్చయించిన సంబంధం చేసుకోవాలన్నమాట!"

"ఏదైనా సమస్య ఉందంటే దాన్ని ఆమూలాగ్రంగా చర్చించాలి. నీకొక ఆదర్శం ఉంది. బాగుంది. నీ ఆదర్శం కోసం, నీ చెల్లాయి భవిష్యత్తు పాడుచేస్తావా? దాని శ్రేయస్సుయొక్క బాధ్యత నీకు లేదా?"

"తప్పకుండా ఉంది."

"అయితే విను. నీకింత చదువు చెప్పించకుండా ఉంటే, ఆ ఎకరం పొలం ఉండేది. దానితో చెల్లాయి పెళ్ళి చేసేవాళ్ళం. కాని నాన్న నీబాగు కూడా కోరేవారే! అందుచేతనే ఎవళ్ళేమి అడ్డుతగిలినా వినకుండా ఇంత చదువు చెప్పించేరు. అయినా నీకున్న ఆదర్శం బాగా డబ్బున్నవర్గం వాళ్ళు ఆచరిస్తే బీదపిల్లలకు మేలుకలుగుతుంది. దానివల్ల సమాజం బాగుపడుతుంది. బాధ్యతెరుంగని ఆదర్శానికి విలువలేదంటాను నువ్వు కానీ తీసుకోనంటున్నావు నీ చెల్లాయికి కానీ ఇవ్వక్కర్లేకుండా పెళ్ళి చేయగలవా?" అమ్మ సవాలు చేస్తున్నట్టనిపించింది

ఇంతవరకు చెల్లాయిమాట ఆలోచించనేలేదు. ఉన్న ఆస్తి అంతా నా చదువుకే అయింది. సమానంగా రక్తం పంచుకొన్న చెల్లాయికి ఇప్పటివరకు ఏం పెట్టేం? ఏం ఇచ్చేం? నా ఆదర్శంతో నా బాధ్యత మర్చిపోతున్నా ననిపించింది. ఆశయసిద్ధికై పోట్లాడమా? చెల్లాయి బాగు చూడ్డమా? ఏది దారి? కర్తవ్యతా మూఢుడనయ్యాను

"ఇప్పుడు చెప్పు నాయనా! చెల్లాయి మొఖం చూసి చెప్పు బాగా ఆలోచించుకుని సమాధానం చెప్పు. రక్తాన్నంతా, చెమటగా ధారపోసి సంపాదించిన డబ్బు నీకోసం ఖర్చుపెట్టినప్పుడు నీ బాధ్యత ఎంత ఉందో గుర్తించుకో."

ఏడుపు పెల్లుబికివచ్చింది. నోరు విప్పలేకపోయేను. చెల్లాయి ముఖం చూస్తే "నా బ్రతుకింతేనా అన్నయ్యా?" అన్నట్లనిపించింది. ఒక్క క్షణం నిలబడలేకపోయాను. వెంటనే బయటికి వచ్చేసేను.

"మీ అమ్మ నిజంగా దేవతే సుమా గిరా! ఎంత చక్కగా చెప్పింది సరిగ్గా అడగవలసిన ప్రశ్నే అడిగింది వెర్రి వెర్రి ఆదర్శాలకై ఆనందమయమైన సంసారం, సంతాపనిలయంగా చెయ్యకు నామటుకి ఈ "వరకట్నాల సమస్య" అందరికీ ఒకవేలం వెర్రిగా పరిణమించిందని తోస్తోంది. నీ చెల్లెలి కోసం, నీ ఆదర్శాన్ని త్యాగం చెయ్యి. ఎవరూ ధన్యవాదా లర్పించక పోయినా, నేను మాత్రం నిన్ను శ్లాఘించకుండా ఉండలేను." తేలికైన హృదయంతో అన్నాడు ప్రకాశరావు.

"నిజంగానా?" సంతృప్తితో రామం "ఆసంబంధం నిశ్చయం చెయ్యమన్నటు ఇంటికి కార్డు రాశాడు. ★


— మహిళలకు మాత్రం —

సంతానం కలుగలేదని నిరాశపడకండి—గర్భము వచ్చి పోతూవుంటే గర్భము నిలుపుకొనుటకు సులభసాధ్యం—శిశువులు కొన్ని మాసములే జీవించుచున్నచో, అట్టి మరణములను నివారించగలము ఋతుసంబంధమైన సమస్త వ్యాధి బాధలకు 16 సంవత్సరములనుండి చేయుచున్న గృహవైద్యము.

వివరములకు వ్రాయండి.

శ్రీమతి జాస్తి పర్వతవర్ధనమ్మ,
పడమర వీధి - ఏలూరు,